క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ రామలింగేశ్వరపేట ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగేశ్వరపేట మెయిన్ రోడ్డు, అయోధ్యటవర్స్, రామలింగేశ్వరపేట జీరోలైన్ నుంచి 7వ లైన్ వరకు, శాంతనగర్, జీరోలైన్ , ఫస్ట్‌లైన్, సెకండ్‌లైన్, బసవతారకనగర్, డొంకరోడ్డు, లోటస్ సెక్టార్ ఫోర్, హెచ్ఆర్‌టీ ఆకాశ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జాతీయ కరాటే పోటీల్లో క్రీడాకారులు సత్తా



విజయవాడస్పోర్ట్స్: జాతీయ కరాటే పోటీల్లో విజయవాడ జేకే కరాటే అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల ఎనిమిదో తేదీన పటమట సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అకాడమీకి చెందిన భువనసాయి, చార్వీఅగర్వాల్, హర్షిత, లిప్సిక, శరణ్య, జెనిత్, యశ్విన్‌సదాశివ, సుజిత్ మనీశ్వర్, సాయిప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్‌కృష్ణ, పునీత్‌రెడ్డి, పుష్కర్‌రెడ్డి, ఆయాన్, జశ్విత, హేమంత్ పతకాలు సాధించారు. క్రీడాకారులను అకాడమీ ఫౌండర్ జె.శ్రీనివాసులు, చీఫ్ కోచ్ జె.హరినాథ్ సోమవారం అభినందించారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు సుప్రభాత సేవతో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు.నెల రోజుల పాటు విశేషంగా గోదారంగనాథులకు పూజలు, అర్చనలు జరుగుతాయన్నారు. 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తుల పూజలు అందుకుంటారన్నారు. 13వ తేదీన శ్రీ గోదా సహిత రంగనాథస్వామివార్ల కల్యాణం జరుగుతుందని తెలిపారు. 14వ తేదీన మకరసంక్రాంతి పురస్కరించుకుని విశేష అర్చనలు పూజలు జరుగుతాయని తెలిపారు. భక్తులు ధనుర్మాసోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన సంగీతోత్సవాలు



విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, శ్రీ స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు త్యాగరాజ స్వామి పరంపరకు చెందిన పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141 వ జయంతి సందర్భంగా శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు సోమవారం ముగిసాయి. పారుపల్లి వద్ద సంగీతాభ్యాసం చేసి పద్మశ్రీ పురస్కారం స్థాయికి చెందిన వయొలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి స్వీయరచనలతోపాటు సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తనలు మధురంగా పలికించారు. బ్రోచేవారెవరే, వాతాపి గణపతిం, సుజన జీవన తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. వయొలిన్‌పై బీవీ దుర్గాభవానీ , మృదంగంపై పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, ఘటంపై హరిబాబు సహకరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు. ఉత్సవం ప్రారంభంలో నిర్వహకులు పారుపల్లి చిత్ర పటానికి పూజలు నిర్వహించారు.

ముస్లిం మైనార్టీ హక్కుల కోసం పోరాడాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఆజాద్ ముస్లిం కమిటీ (ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. ఏఎంసీ తెనాలి నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా పఠాన్ ఫిరోజ్ ఖాన్, మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా షేక్ నాగూర్‌బాషను నియమిస్తూ సింగ్‌నగర్‌లోని ఆ కమిటీ కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ ఏఎంసీలోని ప్రతి నాయకులు, సభ్యుడు ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం కష్టపడాలని.. నిరుపేద ముస్లింలకు సహాయపడేలా సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జనవరి 19న విజయవాడలో జరగబోయే ఏఎంసీ 7వ వార్షికోత్సవ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. షేక్ సాజిద్ అలీ, షేక్ మస్తాన్ వలీ,యండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా అనధికార నిర్మాణాలు!

- సింగ్‌నగర్, నందమూరినగర్, న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ కట్టడాలు
- ఎమ్మెల్యే– కార్పొరేషన్ కమిషనర్ పేరుతో భవన యజమానుల నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూళ్లు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి..
- మామూళ్ల మత్తులో పట్టించుకోని అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'మీరు పైఅంతస్తు వేసుకోవాలా.. మాకు చెప్పండి.. ప్రభుత్వానికి అంతంత డబ్బులు కట్టనవసరం లేదు.. సగం మాకివ్వండి చాలు.. అంతా మేమే చూసుకుంటాం..' అంటూ అధికార పార్టీకి చెందిన నాయకులు, కొంతమంది టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు కలసి అనధికార భవన నిర్మాణాలకు కొమ్ముకాస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల్లో గండి పెడుతూ అవినీతి కాసుల వర్షంలో తడిసి ముద్దవుతున్నారు.



హారికా హోటల్ వెనుక రోడ్డు ఇందిరానాయక్ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

ఎమ్మెల్యే, కార్పొరేషన్ కమిషనర్ పేరుతో వసూళ్లు....

నందమూరినగర్, తోటవారి వీధి, భారతమాత మందిరం రోడ్డు పరిసర ప్రాంతాల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలకు స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేషన్ కమిషనర్ పేరు చెప్పి తమ్ముళ్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ప్రధానంగా బహుళ అంతస్తుల నిర్మాణాల కోసం బాండ్లు అవసరమై ఉండగా వీరు ఆ బిల్డర్లతో బేరాలు కుదుర్చుకొని కమిషనర్‌కు చేతులు తడిపితే ఫైల్ పెట్టినట్లు మాత్రం చూపుతామని, ఎవరైనా అడిగితే మేము ఫైల్ పెట్టామని.. షార్ట్ ఫాల్‌లో ఉందని చెబుతామని లక్షల్లో డబ్బులు వసూళ్లు చేస్తున్నారు.



న్యూఆర్ఆర్‌పేటకు వెళ్లే దారిలో అక్రమ కట్టడం

ప్రభుత్వ ఖాజానాకు భారీగా గండి....

అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఖాజానాకు భారీగా గండిపడుతుంది. లక్షలాది రూపాయలు పక్కదోవ పట్టడంతో పాటుగా ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భవన యజమానులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై దృష్టిపెట్టి వీటిని అదుపుచేయాలని, వీటిపై సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



నందమూరినగర్ బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్ వెంబడి మళ్లీ యథేచ్ఛగా నిర్మిస్తున్న భవనం

అడుగడుగునా.. పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు..

సింగ్‌నగర్, నందమూరినగర్, ఇందిరానాయక్ నగర్, భారతమాత మందిరం రోడ్డు, ఆంధ్రప్రభకాలనీ, తోటవారి వీధి, న్యూరాజరాజేశ్వరీపేట, అమరావతి కాలనీ, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో అడుగడుగునా అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న కొంతమంది వార్డ్ సెక్రటరీలు అక్రమ కట్టడాలకు అండగా నిలబడుతున్నారు. అధికార పార్టీ నాయకులతో కలిసి యథేచ్ఛగా అనధికార భవన నిర్మాణాల దందాను నడుపుతున్నారు. గత ఐదేళ్ల నుంచి ఇక్కడే వారు పాతుకుపోవడంతో వారి ఆగడాలకు హద్దు అదుపూ లేకుండా పోతుంది. అధికార పార్టీ నేతలకు 'వినయ్' విధేయత చూపుతూ.. వారి అక్రమార్జనకు 'ప్రదీపా'లై వెలుగులు పంచుతూ.. అంతా మనదే చూస్కోరా 'సాంబ' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో వీరి అవినీతిపై పలు ఫిర్యాదులు రావడంతో వారిని సస్పెండ్‌చేయడం వరకూ వెళ్లగా సంబంధిత అధికారులకు వారు భారీ మొత్తంలో ముడుపులు చెల్లించి మళ్లీ యథాతథంగా తమ స్థానాల్లో విధులకు హాజరవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో అధికారులు పగలకొట్టిన అనధికార కట్టడాలను సైతం ఇప్పుడు వారు పూర్తిచేయిస్తున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాము

నెల రోజుల క్రితమే ఏసీపీగా ఇక్కడ బాధ్యతలు చేపట్టాను. అక్రమ కట్టడాల గురించి నాకు తెలీదు. వీటిపై సంబంధిత అధికారులతో కలిసి పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టేలా ఉంటే అనధికార కట్టడాలను ఉపేక్షించేది లేదు.

– రాంబాబు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ



న్యూఆర్ఆర్‌పేటలో అనుమతులు లేకుండా....

ఇవిగో కొన్ని ఉదాహరణలు...

- స్థానిక 58వ డివిజన్ నందమూరినగర్ మెయిన్‌రోడ్డులోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్ పక్కన నిబంధనలకు విరుద్ధంగా 250 గజాల పైన ఉన్న మూడో అంతస్తును వేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో వరదలకు ముందు అధికారులు పగలకొట్టగా నేడు యథావిధిగా ఆ భవన నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే అనుచరులు–టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి దీని నిమిత్తం పెద్ద మొత్తంలో డబ్బులు అందినట్లు తెలుస్తుంది.
- స్థానిక 58వ డివిజన్ భారతమాత మందిరం రోడ్డు నుంచి న్యూరాజరాజేశ్వరీపేటకు వెళ్లే రోడ్డులో 200 గజాల స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా మూడో అంతస్తును నిర్మిస్తున్నారు. గతంలో అధికారులకు దీనిపై ఫిర్యాదులు అందగా ఈ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈ భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి టౌన్‌ప్లానింగ్ అధికారులకు రూ.5 లక్షల వరకూ ముట్టాయనే ఆరోపణలు వస్తున్నాయి.
- స్థానిక 58వ డివిజన్ ఇందిరానాయక్‌నగర్ హారికా హోటల్ వెనుక భాగంలో వేదా స్కూల్ రోడ్డులో 260 పైన గజాల ఉన్న స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆ భవనానికి చుట్టూ పరదాలు కట్టి మూడో అంతస్తును నిర్మిస్తున్నారు.
- స్థానిక 57వ డివిజన్‌లోని గ్రేస్ పబ్లిక్ స్కూల్ పైన ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మూడో అంతస్తును నిర్మిస్తున్నారు. దీని కోసం ఎమ్మెల్యే పేరు చెప్పి తమ్ముళ్లు రూ.4 లక్షలు, అధికారులకు రూ.1 లక్ష వరకూ ముట్టినట్లు తెలుస్తుంది.
- 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేట అపార్ట్‌మెంట్స్ వద్ద సాయిబాబా గుడి వెనుక, అమరావతి కాలనీ నాల్గో లైన్‌లోని వినాయకుని గుడిరోడ్డులో రెండో అంతస్తు నిర్మాణం కోసం టౌన్ ప్లానింగ్ సిబ్బంది లక్ష రూపాయలు వసూళ్లు చేసి దాన్ని కట్టిస్తున్నట్లు తెలిసింది.
- అరుణోదయనగర్ మూడో లైన్‌లో, సన్‌సిటీ కాలనీలో, భారతమాత మందిరం రోడ్డు తాడి వీధి, శ్రీదేవి డ్రైక్లీనిక్ రోడ్డు వెనుక భాగం, జయమ్మ కంటి హాస్పటల్ రోడ్డులో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి గురించి సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ఫోనులో ప్రయత్నించగా వారు స్పందించలేదు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించే ప్రతి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లోనూ జరిగింది. సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2 కార్యాలయంలో కమిషనర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి సమస్యను శాఖాధిపతులే స్వయంగా ఫీల్డ్‌లోకి వెళ్లి సమస్యలను తెలుసుకుని సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో స్వీకరించిన ఫిర్యాదులు, వాటిపట్ల శాఖాధిపతులు అనుసరించిన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా..

మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని ఇతర జోనల్ కార్యాలయాల్లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ ధ్యానచంద్ర వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. శాఖాధిపతులు ఫీల్డ్‌లోకి వెళ్లి అప్పుడు ఉన్న పరిస్థితి, సమస్య పరిష్కరించిన తరువాత పరిస్థితిని ఫొటోలతో జత పరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను నిర్దేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సర్కిల్ – 2 కార్యాలయంలో జోనల్ కమిషనర్–2 ప్రభుదాస్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ – 2 ప్రభాకర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ – 2 శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 14 ఫిర్యాదులు అందాయన్నారు. అందులో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 9, రెవెన్యూ 3, ఇంజినీరింగ్ సెక్షన్‌కు చెందిన 2 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని శిఖా సాహిత్య మెగా మ్యూజిక్స్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు సాహిత్య అన్నారు. శిఖా సాహిత్య మెగా ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతారాయ మినీ హాల్‌లో సోమవారం సినీ సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102 వ జయంతి, సినీ సంగీత విభావరితో పాటు గాయనీ గాయకులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య మాట్లాడుతూ కళాకారులను గౌరవించుకోవాలని సూచించారు. వాఖ్యాత సురేష్ మాట్లాడుతూ ఘంటసాల లాంటి గాయకుడు దొరకడం భగవదత్తమైన వరం అన్నారు. ఘంటసాల స్వరం ప్రతి తెలుగు వారి ఇంట్లో వినిపిస్తూ ఉంటుందని చెప్పారు. గాయనీ గాయకులు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలు ఆలపించారు. డేవిడ్‌రాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో కేంద్రీయ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):వికసిత భారత్ పథకంలోని సామాజిక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సోమవారం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ సేవా నిరతిని చాటుకున్నారు. వాంబేకాలనీలోని మాతృదేవోభవ, కోగంటి , అమ్మ ప్రేమ ఆదరణ సంస్థ, పాత ప్రభుత్వాసుపత్రిలోని అన్నసంతర్పణ సమితి సంస్థలను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులతో మమేకం అయ్యి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే వారికి తమ వంతు సాయంగా దుప్పట్లు, బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో తాము వీలైనంత సామాజిక సేవ చేస్తూ కుటుంబ శ్రేయస్సు కోసం తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటామని వృద్ధులకు తెలిపారు. అనంతరం అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యాన నిర్వహించిన అన్నదానంలో పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయ నెంబర్ 1 విజయవాడ ప్రిన్సిపల్ ఎస్.ఆదిశేష శర్మ మాట్లాడుతూ దైనందిక కార్యక్రమాల్లో యాంత్రిక జీవనం గడుపుతున్న సమాజంలో విద్యార్థులలో మానవత్వం సహనత్వం సహాయం చేసే తత్వాన్ని పెంపొందించడంలో భాగంగా వృద్ధాశ్రమాల్లో ఒక రోజు గడిపి వారితో ముచ్చటించేలా పర్యటన రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్, ఎం.అనురాధ ఉపాధ్యాయులు సీతారాం, సరితా యాదవ్ విద్యార్థులు పాల్గొన్నారు.



మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో దుప్పట్లు అందజేస్తున్న విద్యార్థులు



అమ్మ ప్రేమ ఆదరణ సంస్థలో కేంద్రీయ విద్యార్థులు

ఆకట్టుకున్న పాలిటెక్ ఫెస్ట్





ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024 సోమవారం నిర్వహించారు. విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగిన టెక్ ఫెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు నమూనాలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాజెక్టులను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు
- బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ధ్వజమెత్తారు. బుడమేరు వరద బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం సెంట్రల్ సిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ పైపులరోడ్డు సెంటర్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బుడమేరు వరదల వల్ల నగరంలోని 32 డివిజన్లకు చెందిన లక్షల మంది జనాభా అతలాకుతలం అయ్యారని తెలిపారు. ప్రధానంగా సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రజలంతా సర్వం కోల్పోయి ఆర్థికంగా ఎంతో నష్టపోయారని చెప్పారు. వరదలు సంభవించి వంద రోజులు గడిచినా నేటికీ వరద బాధితులందరికీ నష్టపరిహారం అందించడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. వరదల్లో నష్టపోయిన ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ తరువాత బాధితులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. నేటికీ సగం మంది వరద బాధితులు కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాలు.. సచివాలయాలు చుట్టూ తిరుగుతూనే ఉన్నారన్నారు. అన్ని ఆధారాలతో బాధితులు సాయం కోసం ప్రదక్షిణలు చేస్తుంటే కూటమి ప్రభుత్వం మాత్రం అందరికీ నష్టపరిహారం అందించామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నష్టపరిహారం అందితే 100 రోజులు అయినా తమ పనులు మానుకొని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరుగుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చేయకుండా అర్హులు–అనర్హుల లిస్టులు ప్రభుత్వ కార్యాలయాల్లో పెడితే కార్యాలయాల చుట్టూ తిరగటం మానుకుంటారన్నారు. బాధితులందరికీ వెంటనే ఆర్థిక సహాయం అందజేయాలని.. లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు బాధితుల తరపున మెమోరాండం అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, బి.సత్యబాబు, బి.రమణారావు, కె.దుర్గారావు, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే మెరుగైన సమాజ స్థాపన

విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్

విజయవాడ కల్చరల్: యువత నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రా లయోలా కళాశాల ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలోని సెమినార్ హాల్లో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవినీతి అంతం అదే మనపంతం అంశంగా కవి సమ్మేళనం, సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ మెరుగైన సమాజస్థాపన యువతతోనే సాధ్యమన్నారు. యువత సమాజంలో నైతిక విలువలు పెంపు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అవినీతి లేని సమాజం యువత భవితకు సోపానన్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ నేడు సమాజంలో అవినీతి వేయి శిరస్సుల కాలనాగులా విజృంభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నైతిక విలువలకు కట్టుబడి ఉంటామని యువత చేత ప్రతిజ్ఞ చేయించారు. లయోలా కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ జి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ 70 సంవత్సరాల క్రితం ఇదే రోజు లయోలా కళాశాలస్థాపనకు బీజం పడిందని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో కళాపోషకుడు గోళ్ళ నారాయణరావు, గాంధీ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ గాంధీ నాగరాజు, డాక్టర్ సమరం తదితరులు అవినీతి రహిత భారతం యువత కర్తవ్యం అంశంగా ప్రసంగించారు. పినాకినీ ఫెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కె.మురళీ మోహన్‌రాజు, కళాశాల తెలుగు సంస్కృత శాఖాధిపతి డాక్టర్ కె.శేఖర్, కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు. మహిళలు అవినీతి అంతం ఇదే మనపంతం అంశంగా స్వీయ కవితాగానం చేశారు.



మాట్లాడుతున్న ఇంతియాజ్, వేదికపై హజరత్తయ్య గుప్తా, నారాయణరావు తదితరులు

అదానీతో ఒప్పందాలన్నీ రద్దు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదాని అక్రమాలపై విచారణ జరిపేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ నియమించి చర్యలు తీసుకోవాలిన సీపీఐ రాష్ట కార్యదర్శి కె.రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని కోరారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, అదాని దుశ్చర్యలను ఖండిస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో లెనిన్‌సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం సిగ్గు లేకుండా అదానీకి అండగా నిలుస్తుందని చెప్పారు. ఆదానీ అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, అదానికి రాష్ట్రాన్ని దోచిపెడతారని నిలదీశారని గుర్తు చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు బుట్టి రాయప్ప, కేవీ భాస్కరరావు, అప్పురబోతు రాములు, కొట్టు రమణారావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు గోవిందరాజులు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఆదానీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

పోలీస్ ప్రజావాణిలో 65 ఫిర్యాదులు

విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజావాణి) కార్యక్రమంలో 65 మంది నుంచి డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి ఫిర్యాదులను స్వీకరించారు. నగదు లావాదేవీలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, మోసాలు, దొంగతనాలపై ప్రజలు తనకు ఫిర్యాదులు ఇచ్చినట్లు డీసీపీ తెలిపారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించానని చెప్పారు.

